## మనసొంపుగా

"హమ్మయ్య! వచ్చావా! నువ్వు రావేమోననుకున్నాను"

"అంటే? నేను వస్తానో రానో టెస్ట్ చేయడానికి రమ్మన్నావా?"


"అదికాదే! మధ్యాహ్నం కదా! ఎండగా వుందాయె. అందుకే బద్ధకించి సాయంత్రం వస్తావేమోననుకున్నా"

"అంటే? నేను నీ కళ్ళకి బద్ధకస్తురాలిగా, లేజీ ఫెలోగా కనిపిస్తున్నానా? డామిట్"

"అబ్బబ్బ పెడర్థాలు తీయకే! నువ్వు చాలా బిజీ కదా! ఖాళీ దొరుకుతుందో లేదోనని..."

"అంటే? బిజీ అని తెలిసీ అర్జంట్‌గా రమ్మనడంలో నీ ఉద్దేశం ఏమిటి? రాకపోతే రాలేదని, వస్తే ఏ పనీ లేక ఖాళీగా వున్నానని ఎత్తిపొడవడానికా?"

"ఏయ్! ఏంటి తెగ రెచ్చిపోతున్నావ్? వచ్చినప్పటినుంచి చిటపటలాడుతున్నావ్? బజార్లో ఏదైనా హాట్‌హాట్‌గా తినొచ్చావా?"



# ఆడపిల్ల అంతరంగం

"అంటే? బజార్లో నానా గడ్డీ తినేసి, పైత్యం ఎక్కించుకుని ఇక్కడికొచ్చి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నానా?"

"అబ్బబ్బ ఏంటే? ఏమైంది నీకివాళ? నిన్నటిదాకా బాగానే వున్నావుగా? పిచ్చికుక్క గానీ కరవలేదు కదా!"

"అంటే? నేను పిచ్చికుక్కలతోను, పిల్లులతోను, ..కలతోను, పందికొక్కులతోను కరిపించుకునే దాన్లా కనిపిస్తున్నానా?"

"లేదు తల్లీ! లేదు. నువ్వు సాక్షాత్తూ దైవాంశ సంభూతురాలిలా, అపర దేవతలా కనిపిస్తున్నావ్. దా.. దా.. ఇలా కూర్చో"

"అంటే? పూనకం వచ్చిన అమ్మవారిలా వున్నానా? గుళ్ళో విగ్రహంలా నిలబడి వున్నాననేగా నీ ఉద్దేశం?"

"చాలు తల్లీ చాలు! నేనిక భరించలేను. ప్లీజ్ కూర్చో ముందు."

"అంటే? నేను నీకంత భరించలేనిదాన్నయ్యానా? అంత భారమైపోయానా? నా బరువంతా నువ్వే మోస్తున్నావా?"

"హలో! సావని! కూల్ డౌన్. కూల్‌డౌన్ ప్లీజ్.. కీప్ ఎ కూల్ హెడ్" అన్నాను సావని రెండు చేతులూ పట్టుకుని.

"అంటే? కూల్..." అని ఇంకేదో అనబోతుంటే సావని నోరు గట్టిగా చేత్తో మూసేసి సోఫాలో కూలేశాను.

వెంటనే లోపలికెళ్ళి ఫ్రిజ్‌లో కూల్‌డ్రింక్‌ని గ్లాస్‌లో పోసి తీసుకొచ్చి సావనికి ఇచ్చాను.

"వెరీగుడ్! ఇప్పుడు నాకు నచ్చావ్. ఇంటికొచ్చిన అతిథిని సాదరంగా ఆహ్వానించి అతిథి మర్యాదల్ని చకచక చేసేయకుండా అడ్డమైన ప్రశ్నల్తో విసిగిస్తే ఇదే పనిష్మెంట్" అంది సావని గ్లాస్ అందుకుంటూ.

"థాంక్స్! చాలా కొత్త విషయాలు తెలియజేసినందుకు. నాలో జ్ఞాన జ్యోతులు వెలిగించినందుకు" అన్నాను.

డ్రింక్ సిప్‌చేసి "డామిట్. ఇచ్చావా? కీప్ ఎ కూల్ హెడ్ అంటే పెప్సీ ఇస్తావేమోననుకున్నా" అంది కోపంగా సావని.

"నీ మొహం! నేనిచ్చింది పెప్సీనే. నీకు కోక్‌కి, పెప్సీకి తేడా తెలీదు" అన్నాను.

"సారీయార్! నువ్వసలు ఏ డ్రింక్ ఇచ్చావో తెలీలేదు. కొంపతీసి నువ్వు ఏ విస్కీయో, బ్రాందీయో పోసేసి కూల్‌డ్రింకని ఇచ్చావనుకో. ఇక నా పని తందాన తానే" అంది నవ్వుతూ సావని.

"పిచ్చిమొద్దూ! కూల్‌డ్రింక్‌కి, హాట్ డ్రింక్‌కి కూడా తేడా తెలీదా?" అన్నాను వెక్కిరిస్తున్నట్టు.

"భలేదానివే! ఎప్పుడైనా ఒక్క రౌండ్ హాట్ డ్రింక్ తాగాలని మాగ్జిమం ట్రైచేశా! ఛాన్స్ దొరకలా" అంది సీక్రెట్ చెబుతున్నట్టు నెమ్మదిగా.

"అలా చెవులు కొరుక్కుంటుంటే మాకెలా విని పిస్తాయి?" అంటూ హాల్లోకి వచ్చి మా ఎదురుగా ఈజీ చైర్లో కూర్చున్నారు నాక్కాబోయే అత్తగారు.

నేను మర్యాదపూర్వకంగా లేచి నిలబడ్డాను. నాతోపాటు సావని కూడా లేచి నిలబడింది.

"అత్తయ్యా! తను సావని. నా క్లోజ్ ఫ్రెండ్" అని సావనివైపు తిరిగి

"మా అత్తగారు" అన్నాను నెమ్మదిగా.

సావని వెంటనే చేతిలోని గ్లాసుని టీపాయ్‌మీద పెట్టేసి వినయంగా రెండు చేతులూ జోడించి

"నమస్తే ఆంటీ..." అంది.

"నమస్తే! కూర్చోమ్మా! ఏం చేస్తున్నావ్?" అని అడిగారు అత్తగారు.

"ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నానండి" అంది సావని.

"పెళ్ళయిందా?" అనుమానంగా అడిగారు అత్త గారు.

"కాలేదండి" కొంచెం సిగ్గుపడుతూ అంది సావని.

"అరే! ఒఠి అల్లరిపిల్లేననుకున్నా. పరవా లేదే! వినయం, విధేయత, సిగ్గు, బిడియం అన్నీ వున్నాయి" అన్నారు మా అత్తగారు నవ్వుతూ.

సావని కించిత్ ఆశ్చర్యంగా చూసి వెంటనే తలదించుకుంది.

"మరీ అంత మంచి అమ్మాయిలా వుండనక్కర లేదమ్మా. ఇందాకటిలాగే సరదాగా జోక్‌లేయొచ్చు. నేనూ ఎంజాయ్ చేస్తాను" అన్నారు అత్తగారు.

సావని నవ్వేసి ఊరుకుంది. రెండు క్షణాల తర్వాత మళ్ళీ అత్తగారే అన్నారు "నేనొచ్చి మిమ్మల్ని డిస్టర్బ్ చేసినట్టున్నాను" అని లేవబోయారు.

"అబ్బే లేదండీ! కూర్చోండి" అన్నాను కంగా రుగా.

"ఏమమ్మా! నీకింత చలాకీ ఫ్రెండ్ వుందని మాటమాత్రమైనా చెప్పలేదే!" అన్నారు అత్తగారు.

"సందర్భం రాలేదు" అని నసిగాను ఏం చెప్పాలో తెలీక.

"నేను ఇందాకటినుంచి మీ సంభాషణ వింటూనే వున్నా.. సావనీ! నువ్వు ఓ నెలరోజుల ముందు పరిచయమై వుంటే నిన్నే మా కోడలిగా సెలక్ట్ చేసుకునేదాన్ని. దేనికైనా అదృష్టం వుండాలి"

"అత్తగారూ! నాకు అన్యాయం చేస్తారా" ఏడుపు మొహం పెట్టి అన్నాన్నేను.

"ఏమ్మా! నువ్వు అన్యాయం చేయలేదా! ఇంత అందమైన, చలాకీయైన, ఉద్యోగం చేస్తున్న అమ్మాయి నీ ఫ్రెండ్‌గా కనీసం ఇప్పటిదాకా పరిచయం చేయకపోవడం అన్యాయం కాదా!.. మీ ఇద్దరినీ పక్కపక్కన నిలబెడితే సావనికే మంచి మార్కులొస్తాయి" అన్నారు అత్తగారు.

నేను సావని వంక ఈర్ష్యగా చూశాను. సావని నావంక జాలిగా చూసింది. ఇద్దరం నవ్వేసుకున్నాం. అత్తగారు కూడా మా నవ్వులో శ్రుతి కలిపారు. ఇంతలో అమ్మ వచ్చి సావనిని వంటగదిలోకి తీసుకెళ్ళింది.

"ఈ అమ్మాయికి పెళ్ళి సంబంధాలు చూస్తు న్నారా?" అని అడిగారు అత్తగారు.

"చూస్తున్నారు అత్తయ్యా! కాని ఓ ప్రాబ్లం వల్ల సెటిల్ కావడం లేదు" అన్నాను.

"ఏంటది? కట్నమా" అన్నారు అత్తగారు.

"కాదండి. పెళ్ళికి సావని ఓ కండిషన్ పెడు తోంది. పెళ్ళయిన తర్వాత తన తల్లిదండ్రులు తనతోటే వుంటారని. అందుకు అంగీకరిస్తేనే పెళ్ళికి ఒప్పుకుంటానని సావని అంటోంది. ఈ కండిషన్ వల్లే చాలా సంబంధాలు వెనక్కు వెళ్ళి పోయాయి" అన్నాను.

"సావనికి అన్నదమ్ములెవరూ లేరా?" అడిగారు అత్తయ్య.

"లేకేం! ఇద్దరు అన్నయ్యలున్నారు. పెద్దవాడి చదువుకోసం బాగా ఖర్చుచేశారు. లక్షలు పోసి కంప్యూటర్ కోర్స్ చదివించి అమెరికా పంపించా లని ప్రయత్నాలు చేశారు. కాని మోసపోయారు. చివరికి అతను నాగపూర్ వెళ్ళిపోయి అక్కడ ఏదో కంపెనీలో చేరిపోయాడు."

"అతను చూడొచ్చుగా తల్లిదండ్రుల్ని" అడిగారు అత్తయ్య.

"ఏం చూస్తాడు? స్వార్థం ఎక్కువ. నాగపూర్ వెళ్ళినప్పటినుంచి పేరెంట్స్‌ని పట్టించుకోవడం మానే శాడు. చివరికి అక్కడే వున్న మన తెలుగువాళ్ళ ఫ్యామిలీకి చెందిన అమ్మాయిని పెళ్ళి చేసుకుం టున్నట్టు లెటర్ రాశాడట. అది తెలిసి సావని పేరెంట్స్ చాలా బాధపడ్డారు."

"మరి రెండోవాడి సంగతేమిటి?"

"రెండోవాడికి చదువు అంతగా అబ్బలేదు. వాడిదో దారి. ఏవేవో బిజినెస్‌లంటూ తిరుగుతుం టాడు. రెండేళ్ళ క్రితం ఇల్లొదిలి వెళ్ళిపోయాడు. ఎప్పుడన్నా వస్తుంటాడు. వచ్చినపుడు మాత్రం ఇంటి ల్లిపాదికీ బట్టలు తెస్తుంటాడు"

"సావని ఫాదరేం చేస్తుంటారు?"

"ఆయన స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగిగా వుండే వారు. పెద్దకొడుకు కోసం వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని ఆ డబ్బుతో చదివించారు. ప్రస్తుతం వాళ్ళకి ఓ చిన్న ఇల్లు వుంది. అంతే. దాన్ని సావని పెళ్ళికోసం వుంచారు. అది అమ్మేసి సావని పెళ్ళిచేస్తే వాళ్ళకి నిలువ నీడ వుండదు. పెన్షన్ డబ్బుల్తో వాళ్ళెలా రోజులు గడుపుతారు? అంటుంది సావని" అన్నాను.

అత్తయ్య భారంగా నిట్టూర్చారు.

రెండు క్షణాల తర్వాత నేనే అన్నాను.

"సావనికి ఎన్నో ఆశలుండేవి. తనకి స్టాటిస్టిక్స్ అన్నా, ఎకనామిక్స్ అన్నా చాలా ఇష్టం. అందుకే ఇండియన్ ఎకనమిక్ సర్వీస్ పరీక్షలు పాసవ్వాలని, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాలని ఎన్నో కలలు కనేది. కాని అవేవీ తీరలేదు. జాబ్‌లో చేరితేనైనా సంబంధాలు త్వరగా కుదు రుతాయని భావించి ప్రైవేట్ కంపెనీలో చేరింది. సంబంధాలైతే వస్తున్నాయి కాని ఏవీ కుదరడం లేదు. పెళ్ళాం తెచ్చే జీతం కావాలట. కాని అత్తమామల్ని పోషించడం మాత్రం కుదరదట. వచ్చిన సంబంధాలన్నీ ఈ కండిషన్ వల్లే వెనక్కి వెళ్ళిపోతున్నాయి" అన్నాను.

రెండు క్షణాల తర్వాత అత్తయ్య అన్నారు "చాలా కుటుంబాల్లో తల్లిదండ్రుల పరిస్థితి ఇలాగే వుందమ్మా. మగపిల్లలు రెక్కలొచ్చాక తమ దారి తాము వెతుక్కుని వెళ్ళిపోతారు. వాడి పెళ్ళి, వాడి పిల్లలు, వారి సంసారం- అదే లోకం తప్ప కన్న తల్లిదండ్రులవైపు కన్నెత్తి చూడను కూడా చూడరు. వృద్ధాప్యంలో వున్నవారిని ఆదుకోవడం తమ కనీస బాధ్యతగా గుర్తించరు. అదొక భారంగా, గుదిబండగా ఫీలవుతారు. ఈ విషయంలో ఆడ పిల్లలే నయమమ్మా. అటు తల్లిదండ్రుల్ని, ఇటు అత్తమామల్ని కూడా చూసుకోగలిగే ఔదార్యం, మంచి మనసు ఆడపిల్లలకే వుంటుంది. కాని మొగాడి పెత్తనం కింద వాళ్ళు కూడా నిస్సహాయు లౌతున్నారు. సావని తన స్వార్థం చూసుకుంటే తల్లిదండ్రులు దిక్కులేని వాళ్ళవుతారు. మరి వారి తోడు కోసం తాపత్రయపడితే తన జీవితాన్ని త్యాగం చేయాల్సి వస్తుంది. దీనికి పరిష్కారం ఎపుడో!" అన్నారు శూన్యంలోకి చూస్తునట్టు.

నేనూ అలాగే ఆలోచిస్తూ సోఫాలో జారగిలబ డ్డాను.

— మోతీలాస్య

ఫ్లాష్

అమీర్‌ఖాన్, షారుఖ్‌ఖాన్‌లకు దర్శ కత్వ విభాగంలో చొరబడటం అల వాటు. అయితే దర్శకులు ఎందుకో గాని అమీర్‌కాన్ సలహాలు స్వీక రిస్తారు. కానీ షారూఖ్‌ఖాన్ సూచ నలు ఎవరూ సీరియస్‌గా తీసుకోరట. అయినా షారూఖ్‌ఖాన్ నిరుత్సాహపడ లేదు. ఎప్పుడో ఒకప్పుడు తన సూచనలు, ఐడియాలతో ఏ మంచి సినిమాకు దర్శకత్వం వహిస్తానని అంటున్నాడు.

